క్లుప్తంగా

తాజ్‌మహల్ తపాలా బిళ్లల సేకరణ



తాజ్‌మహల్‌పై తపాలా బిళ్లలు

అమలాపురం టౌన్: తాజ్‌మహల్‌పై ఐక్యరాజ్య సమితికి చెందిన తపాలా శాఖ విడుదల చేసిన తపాలా బిళ్లలను అమలాపురానికి చెందిన సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు. తాజ్‌మహల్‌పై వివిధ సమయాల్లో తీసిన ఆరు చిత్రాలను రంగులతో ఆకర్షణీయంగా ముద్రించారు. ఒక్కో చిత్రంపై నాలుగు తపాలా బిళ్లలను విడుదల చేశారు. వీటిని ఒక పుస్తక రూపంలో ముద్రించి ఆ పేజీల్లో తాజ్‌మహల్ నిర్మాణానికి సంబంధించిన విశేషాలను పొందుపరిచారు. 2014లో ఈ 24 తపాలా బిళ్లలను విడుదల చేశారు.

క్రీడా దుస్తుల పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడల్లో ప్రతిభ చాటుతున్న విద్యార్థులకు గతంలో ఇదే పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు రూ.15 వేల విలువైన క్రీడా దుస్తులను సమకూర్చారు. గతంలో పని చేసిన హెచ్ఎం భమిడిపాటి రామకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వర రావు, మూలా రామకృష్ణ, అప్పారావు, జి.విశ్వనాథ్‌లు క్రీడా దుస్తులను సమకూర్చి విద్యార్థులకు అందజేశారు. పాఠశాల హెచ్ఎం ఎస్.రాజరాజేశ్వరి చేతుల మీదుగా ఆ పాఠశాలలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది.

సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ

ముమ్మిడివరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల భాషా విభాగం ఆధ్వర్యంలో 28న జరిగే జాతీయ సెమినార్‌కు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. దీనిని కళాశాల ప్రధాన అధ్యాపకుడు డాక్టర్ ఎస్.ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సెమినార్‌లో ఎమర్జింగ్ ట్రెండ్ ఇన్ ఇండియన్ రైటింగ్ ఇన్ ఇంగ్లిషు అనే అంశంపై పరిశోధన పత్రాల ప్రదర్శన, విశ్వవిద్యాలయాల ఆచార్యుల సందేశం ఉంటుందని సెమినార్ కన్వీనర్ డాక్టర్ సంధ్యారాణి తెలిపారు. కె.చిట్టిబాబు, డాక్టర్ సుజాత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అర్చకుల నిరసన

ఐ.పోలవరం: ఆదిశైవ సంఘాన్ని, సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామశర్మ (మురమళ్ల రాంబాబు)ను సభా మర్యాద లేకుండా అగౌరవపరిచిన అర్చక సమాఖ్య అధ్యక్షుడు అత్రేయ బాబు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ అర్చకులు, పండితులు డిమాండ్ చేశారు. ఆ ఆలయ ఆవరణలో గురువారం నల్లరిబ్బన్లతో తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఉండి దత్తుశర్మ మాట్లాడుతూ సంఘ అధ్యక్షునికి బహిరంగ క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర స్థాయిలో ఈ ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఉప్పలగుప్తం: అర్చక సమావేశంలో ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ సంఘాన్ని, అధ్యక్షుడు రాంబాబుని కించపరిచేలా మాట్లాడటాన్ని ఉప్పలగుప్తం అర్చక సమావేశం ఖండించింది. ఐదు మండలాలకు చెందిన ఆదిశైవ సంఘ అర్చకులతో స్థానికంగా సమావేశం నిర్వహించారు.

న్యాయవాదుల నిరసన

అమలాపురం టౌన్: తమ డిమాండ్ల సాధన కోసం అమలాపురం బార్ అసోసియేషన్, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కోర్టు భవనాల సముదాయం ముందు న్యాయవాదులు గురువారం నిరసన తెలిపారు. ఐఎల్ఏ జిల్లా కన్వీనర్ పినిపే రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తమ రక్షణకు చట్టం చేయాలని, మరణించిన వారికి రూ.4 లక్షలు ఇవ్వాలని తదితర డిమాండ్లపై న్యాయవాదులు నినదించారు. సీనియర్ న్యాయవాదులు డీబీ లోక్, కాట్రు చంద్రమోహన్, బడుగు భాస్కర్, కోలా త్రిమూర్తులు, దాకారపు చిరంజీవి, మోహనరావు పాల్గొన్నారు.

110 మంది రక్తదానం

తాళ్లరేవు: ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ పుట్టినరోజు వేడుకలను గురువారం తాళ్లరేవులో ఘనంగా నిర్వహించారు. స్థానిక సూర్యభాస్కర కల్యాణ మండపంలో తాళ్లరేవు శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శివన్నారాయణ బర్త్‌డే కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన రక్తదాన శిబిరంలో రోటరీ క్లబ్, యువసేన బ్లడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. శివన్నారాయణ 60వ సారి రక్తదానం చేశారు. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు..

విజిలెన్స్ తనిఖీలు

ముమ్మిడివరం: స్థానిక శ్రీతారకరామా ట్రేడర్స్ ఎరువుల షాపును గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్ ప్రకారం గొడౌన్‌లో భౌతిక, ఆన్‌లైన్ నిల్వలను పరిశీలించారు. ఎరువుల నిల్వల పట్టిక, పురుగుల మందు స్టాక్ రిజిస్టర్లను చూశారు. స్టాక్ రిజిస్టర్లను రైతులకు కనిపించే విధంగా ప్రదర్శించాలని, అమ్మకాలను ఆధునీకరించాలని ఆదేశించారు. అగస్త్య ఆగ్ర లిమిటెడ్ కంపెనీకి చెందిన పైమెట్రోజోన్ పురుగు మందును కొనుగోలు చేసిన ఇన్వాయిస్‌కు పురుగు మందు బాటిల్‌పై ఉన్న సమాచారానికి వ్యత్యాసం ఉన్నందున 15,500 కిలోల మందు అమ్మకాలను నిలుపుదల చేశారు. ఆ మందుకు సంబంధించి నమూనాలు సేకరించి పురుగు మందుల నాణ్యత పరీక్షలకు ప్రయోగశాలకు పంపించారు.

ప్రజారోగ్యమే ప్రతి ఇంటికీ సౌభాగ్యం

తాళ్లరేవు: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు జరుగుతుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. గురువారం గాడిమొగ పంచాయతీ పరిధి లక్ష్మీపతిపురం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. సుమారు 585 మందికి వైద్య పరీక్షలు చేశారు. గాడిమొగ, తాళ్లరేవు పీహెచ్‌సీల వైద్యులతో పాటు ప్రత్యేక వైద్య నిపుణుల బృందం రోగులను పరీక్షించి అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసింది. అనంతరం ఎంపీపీ సునీత చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఎంపీపీ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ, ఎంఈఓ-2 మోకా ఉమ, ఎంపీటీసీ సభ్యులు రేకాడి నరసింహమూర్తి, చెక్కా కామేశ్వరరావు, ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, నాయకులు రాయుడు గంగాధర్, కామాడి మాతరాజు, అరదాడి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీపతిపురంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సునీత తదితరులు

ఐ.పోలవరం: పేదల ఆరోగ్య సమస్యలు గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని సర్పంచ్ కడియం తమ్మయ్య అన్నారు. తిళ్లకుప్ప సచివాలయం ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో 533 మందికి వివిధ రకాల వైద్య సేవలను వైద్యులు కె.ఇందిరాశ్రీ, టి.ఆదిత్య పవన్, రమ్య, టి.పవన్ అందించారు. ల్యాబ్ టెస్టులు 258, కంటి పరీక్షలు 75 మందికి చేశారు.

'జగనన్న సురక్ష'తో సంపూర్ణ ఆరోగ్యం

ముమ్మిడివరం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జెడ్పీటీసీ కుడిపూడి శివ శంకరరావు అన్నారు. అన్నంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. సర్పంచ్ మట్టపర్తి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో జెడ్పీటీసీ మాట్లాడారు. అనంతరం వైద్యులు సుమారు 552 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించారు. ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, వైస్ ఎంపీపీలు పాము నాగవేణి, మట్టపర్తి సురేష్, పాము చిట్టిబాబు, ఈఓపీఆర్‌డీ సీహెచ్ఎల్.కల్యాణి, డాక్టర్లు వినీల్, రాహుల్, ముకుందా పాల్గొన్నారు.



కొమరగిరిపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు



బండారులంకలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ దోలామణి, ఎంపీపీ భాగ్యలక్ష్మి

ఆరోగ్య సురక్షతో మేలు

అల్లవరం: ప్రజారోగ్యం ప్రతి ఇంటికీ సౌభాగ్యం అనే నినాదంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. నోడల్ అధికారి తహసీల్దార్ సాంబశివప్రసాద్ ఆధ్వర్యంలో కొమరగిరిపట్నం-3 సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి సందర్శించారు. అనంతరం రోగులకు ఆరోగ్య కిట్లు అందించారు. ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ గుర్రం బాబులు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాద్, నాయకులు బొంతు సత్యనారాయణ, బైరిశెట్టి రామారావు పాల్గొన్నారు.

కాట్రేనికోన: జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరిస్తుందని ఉమ్మడి జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నడింపల్లి సూరిబాబు అన్నారు. చెయ్యేరులో సర్పంచ్ చెల్లి సురేష్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. కాట్రేనికోన పీహెచ్‌సీ వైద్యురాలు నీలిమా ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. ఎంపీడీఓ వెంకటచలం, తహసీల్దార్ సత్యనారాయణ, మంతెన మమ్మురాజు, సందీప్, మట్టపర్తి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ఆరోగ్యవంతమైన సమాజం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి అన్నారు. బండారులంక సచివాలయ పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి, సర్పంచ్ పెనుమాల సునీతతో కలిసి ఆమె ప్రారంభించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, కార్యదర్శి చేగొండి సత్యనారాయణమూర్తి, ఎంపీటీసీ గుత్తుల జానకి లక్ష్మి, అంకం హేమభారతి, సరేళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా అమృత్ కలశ యాత్ర

యానాం: నా మట్టి- నా దేశం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో అమృత్ కలశ యాత్రను నిర్వహించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

గ్యాస్ రాయితీ జమ

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యాస్ రాయితీకి సంబంధించిన మొత్తం మొదటి దఫాలో 20 వేల మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతా ల్లో జమ చేసినట్లు, మిగిలిన 24 వేల మందికి సైతం వచ్చేవారం జమ అవుతాయని గురువారం పుదుచ్చేరి సివిల్ సప్లయిస్ శాఖ అధికారులు తెలిపారు.

అపూర్వ స్వాగతం







కాకినాడ జిల్లా సామర్లకోట ఈటీసీ లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్లకు గృహ ప్రవేశాలు చేసి రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. సామర్లకోటకు వచ్చిన సీఎంకు మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అపూర్వ స్వాగతం పలికారు.

శెట్టిబలిజలకు అధిక ప్రాధాన్యం

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

తాళ్లరేవు: శెట్టిబలిజ సామాజిక వర్గానికి వైఎస్ కుటుంబం వల్లే ఎనలేని ప్రాధాన్యం వచ్చిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, సమాచార, సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. గురువారం తాళ్లరేవులో ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌తో కలసి పాల్గొన్నారు. గజమాలతో శివన్నారాయణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 14 ఏళ్లపాటు అధికారంలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు రెండేళ్లపాటు శెట్టిబలిజలకు మంత్రి పదవి ఇచ్చి సరిపెడితే రాజశేఖర్‌రెడ్డి ఇద్దరికి పూర్తికాలం పాటు మంత్రి పదవులు ఇచ్చారన్నారు. శెట్టిబలిజలపై ఉన్న నమ్మకంతో ఒక మంత్రి పదవితో పాటు, ఒక రాజ్యసభ సభ్యుడు, ఇద్దరికి ఎమ్మెల్సీలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, ఎంపీపీలు, కార్పొరేషన్ డైరెక్టర్ పదవులను శెట్టిబలిజలకు కట్టబెట్టారన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో శెట్టిబలిజలు రాజకీయ చైతన్యంతో ఉండడంతో, 2008లో స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి తనను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమించారన్నారు. మత్స్యకార సామాజిక వర్గం నుంచి పొన్నాడ సతీష్ విజయం సాధించడంతో బీసీలకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. ఈ రెండు జిల్లాల్లో పెద్దన్న పాత్ర పోషించేది శెట్టిబలిజలే అన్నారు. కేబినెట్‌లో శెట్టిబలిజలకు రెండు మంత్రి పదవులు ఇచ్చిన దాఖలాలు ఎప్పుడూ లేవని, అయితే రాజశేఖర్‌రెడ్డి సమయంలో పిల్లి సుభాష్ చంద్రబోస్, పితాని సత్యనారాయణలకు మంత్రి పదవులు ఇచ్చి చరిత్రను తిరగరాశారన్నారు. కులగణన జరిపించాలని ఎంతోకాలంగా కోరుతున్నామని, ఇప్పటికి ఆ కోరిక నెరవేరే సమయం వచ్చిందన్నారు. బీసీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ మరో బీసీకి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కట్టబెట్టిన ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను ఆయన అభినందించారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయికి ఎదిగిన శివన్నారాయణ సేవాభావంతోనే ఉన్నత స్థానానికి ఎదిగారని కొనియాడారు. ఎంపీపీ రాయుడు సునీత, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణను సత్కరిస్తున్న మంత్రి వేణు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్

మెప్మా అర్బన్ మార్కెట్‌కు ఆదరణ

అమలాపురం టౌన్: స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు సొంతంగా తయారు చేసిన వస్తువుల కొనుగోళ్ల కోసం అమలాపురం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటైన మెప్మా అర్బన్ మార్కెట్‌కు అన్ని వర్గాల నుంచి ఆదరణ లభించింది. ఈ మార్కెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ప్రారంభించి కొన్ని వస్తువులను కొనుగోలు చేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ మార్కెట్ గురు, శుక్రవారాల్లో పనిచేస్తోంది. ఇక్కడ పట్టణానికి చెందిన డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. ఈ రెండు రోజుల్లో రూ.2 లక్షల మేర అమ్మకాల ద్వారా టోర్నవర్ రావచ్చని పట్టణ సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు, మెప్మా జిల్లా సిబ్బంది సీహెచ్ శ్రీనివాస్, టౌన్ లెవెల్ సమాఖ్య అధ్యక్షురాలు కె.సుజాత, పట్టణ సమాఖ్య ఆర్పీ పాము శ్యామల పర్యవేక్షించారు. మార్కెట్ ప్రారంభోత్సవానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజలు ఇక్కడి తినుబండారాలు, పలు రకాల గృహోపయోగ వస్తువులను కొనుగోలు చేసి మహిళల స్వయం ఉపాధికి తమ వంతు చేయూత అందించారు.



మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి, కౌన్సిలర్లు

మత్స్యకార గ్రామాల్లో సదుపాయాలు

యానాం: మత్స్యకార గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అన్నారు. గురువారం నియోజకవర్గ శివారు ప్రాంత గ్రామాల్లో రూ.1.65 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. గిరియాంపేట రక్షాహరికృష్ణ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రూ.12.59 లక్షలతో చేపట్టే టాయ్‌లెట్స్ బ్లాక్‌కు సీసీ అప్రోచ్ దారికి, దరియాలతిప్ప అంబేడ్కర్ విగ్రహం నుంచి నూకాలమ్మ దేవాలయం వరకూ రూ.9.50 లక్షలతో డ్రైన్‌కు, రూ.41.47 లక్షలతో దరియాలతిప్ప వాటర్‌వర్క్స్ అభివృద్ధి పనులకు, రూ.51.36 లక్షలతో కురసాంపేట హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు, రూ.24 లక్షలతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సీగల్స్ రెస్టారెంట్‌లో పనులకు, రూ.26 లక్షలతో సీగల్స్ రెస్టారెంట్ మరమ్మతులకు భూమి పూజ నిర్వహించారు. ఆర్ఏఓ మునిస్వామి పాల్గొన్నారు.

కొబ్బరి పరిశ్రమల ప్రోత్సాహానికి సహకరించాలి

ముమ్మిడివరం: కోనసీమలో కొబ్బరి ఆధారిత పరిశ్రమల ప్రోత్సాహానికి సహాయ సహకారాలు అందించాలని ఇన్వెస్ట్ ఇండియా విశ్వవిద్యాలయం బృందాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. ముమ్మిడివరంలో వర్జిన్ కోకోనట్ ఆయిల్ యూనిట్ నుంచి ఉత్పత్తి చేసే కొబ్బరి ఉత్పాదకాలను ఒక జిల్లా ఒక ఉత్పత్తిపై ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి హరిప్రీత్‌సింగ్ బృందం గురువారం పరిశీలించింది. ఆయిల్ యూనిట్ ద్వారా ఉత్పత్తి చేసే ఉత్పత్తులను బృందం సభ్యులు పరిశీలించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీవీ రమణ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వరప్రసాద్, డీఆర్‌డీఏ పథక సంచాలకులు బి.శివశంకర ప్రసాద్, జిల్లా చేనేత, జౌళీశాఖ అధికారి రాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్యాంబాబు, నాబార్డు జీఎం స్వామినాయుడు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: కొబ్బరి సాగు, విలువ ఆధారిత పరిశ్రమల ఆవశ్యకతపై ఇన్వెస్ట్ ఇండియా విశ్వవిద్యాలయానికి చెందిన హరిప్రీత్‌సింగ్ నేతృత్వంలో కేంద్ర బృందం సభ్యులు పేరూరులో క్షేత్రస్థాయి సందర్శన చేశారు. పీచు పరిశ్రమలను అధ్యయనం చేశారు. పేరూరులో స్వయం సహాయక సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన కొబ్బరి తాళ్ల తయారీ ఇండస్ట్రీని, కొబ్బరి ప్యాక్ హౌస్‌ను సందర్శించి వారితో బృందం సభ్యులు మాట్లాడారు. కొంకాపల్లి బ్యాంకు అందించిన రూ.రెండు లక్షల రుణం చెక్కును మహిళలకు అందించారు.



ముమ్మిడివరంలో కొబ్బరి నూనె యూనిట్‌ను పరిశీలిస్తున్న సభ్యులు, కలెక్టర్ హిమాన్షు శుక్లా

53 మంది రక్తదానం

అమలాపురం టౌన్: స్థానిక శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన 53 మంది యోగా విద్యార్థులు మూడు రోజుల్లో నాలుగు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర రోగులకు ఆసరాగా నిలిచారు. రాజమహేంద్రవరం, కాకినాడ, కొత్తపేట, అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు వీరు రక్తదానం చేశారు. ఇందులో ముమ్మిడివరం కానిస్టేబుళ్లు బొడ్డు వెంకటేష్, సూరిబాబు కూడా రక్తదానం చేశారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో తలసేమియా రోగులకు, గర్భిణులకు గురువారం తమ యోగాశ్రమానికి చెందిన విద్యార్థులు గురువారం రక్తదానం చేశారని ఆ యోగాశ్రమ యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

అమలాపురం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి స్థాయిలో జరిగిన వివిధ క్రీడ పోటీల్లో కామనగరువు ఆదిత్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-17 ఆర్చరీ, షార్ట్‌పుట్ విభాగాల్లో ఐ.సూర్యవెంకట శ్రీకిరణ్, ఆర్.డానీకుమార్ జిల్లా మొదటి స్థానాన్ని సాధించారు. అండర్-14 బ్యాడ్మింటన్‌లో కె.హాసినీప్రభ 3వ స్థానం సాధించి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. వీరిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎస్.శృతి రెడ్డి, ఆదిత్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు, పాఠశాల ప్రిన్సిపాల్ రామప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ సుధ తదితరులు అభినందించారు.

అవినీతి రహిత సమాజమే లక్ష్యం

అల్లవరం: అవినీతి రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వేటుకూరి శ్రీనివాసరాజు అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా అవినీతి రహిత సమాజం అనే అంశంపై సామంతుర్రు ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నివాసరాజు బహుమతులను అందించారు. హెచ్ఎం చీకట్ల సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, వీరబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయండి

యానాం: నియోజకవర్గంలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కోరారు. గురువారం రాత్రి ఆర్ఏఓ ఛాంబర్‌లో ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోపాల్‌నగర్, సాయినగర్, బ్రహ్మానంద నగర్ ప్రధాన రహదారి పనులు ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ నిర్మాణం జరగలేదన్నారు.

పిచ్చికుక్క దాడి

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం, పెదగాడవిల్లి, చినగాడవిల్లి గ్రామాల్లో గురువారం పిచ్చికుక్క 10 మందిని గాయపరిచింది. వీరికి ఉప్పలగుప్తం పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసి వ్యాక్సిన్ నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని వైద్యాధికారి ఎల్.నాగార్జున తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లవరం: బెండమూర్లంక సబ్ స్టేషన్ పరిధిలోని గోడి, గోడిలంక, మొగళ్లమూరు, తమ్మలపల్లి, బెండమూర్లంక, కొమరగిరిపట్నం, ఎస్.రామేశ్వరం, ఓడలరేవు, రెబ్బనపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రవికుమార్ గురువారం తెలిపారు.

పాఠశాలలో డీఈఓ తనిఖీలు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఈఓ కె.కమలాకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని, తరగతి స్థితిగతులను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఉప్పలగుప్తంలోని భవిత సెంటర్‌ను పరిశీలించారు.

పరిశ్రమలు పెరగాలి

అమలాపురం రూరల్: కొబ్బరి పీచు ఆధారిత పరిశ్రమలు పెరగాలని నాబార్డు ఏజీఎం వై.స్వామినాయుడు అన్నారు. నాబార్డు ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోకోనట్ ఆధారిత పరిశ్రమలపై మహిళలకు జనుపెల్లలో శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం, ప్రతినిధి రాజా పాల్గొన్నారు.

సైన్స్ పట్ల ఆసక్తి పెంచాలి



క్విజ్ పోటీల వాల్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న డీఈఓ కమలకుమారి తదితరులు

అమలాపురం టౌన్: విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచాలని, వారికి శాస్త్రవేత్తల ప్రయోగాల గురించి ఉపాధ్యాయులు వివరించాలని డీఈఓ ఎం.కమలకుమారి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏటా నిర్వహించే కౌశల్ క్విజ్ పోటీలకు సంబంధించిన కౌశల్ -2023 వాల్ పోస్టర్లను డీఈఓ గురువారం ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో కౌశల్ క్విజ్ పోటీల జిల్లా కోఆర్డినేటర్ బీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ వచ్చే డిసెంబర్ 6, 7, 8 తేదీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు జరుగుతాయని చెప్పారు. సీఎంఓ బీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ రమణశ్రీ, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సెక్రటరీ హనుమంతరావు, డీఎస్ఓ జీవీ సుబ్రహ్మణ్యం, క్విజ్ పోటీల జిల్లా సహ కోఆర్డినేటర్ భాస్కరరావు, పీవీ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

ఐ.పోలవరం: జిల్లా స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం ఐ.పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.రాంబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ఫిర్యాదులు ఇచ్చేవారు నేరుగా అధికారులకు అందజేసి చెప్పుకోవచ్చని తెలిపారు.

హుండీ ఆదాయం రూ.11.06 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న భక్తులు, పర్యవేక్షిస్తున్న ఆలయ చైర్‌పర్సన్, ఈఓలు, ధర్మకర్తలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను గురువారం తెరిచి లెక్కించారు. గత 83 రోజుకు గాను ఆదాయం సమకూరిందని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో వచ్చిన ఆదాయం కంటే మరింత పెరిగిందని ఆమె అన్నారు. హుండీల ద్వారా రూ.11.06 లక్షలతో పాటు 18 గ్రాముల బంగారం, 345 గ్రాముల వెండి వచ్చిందని చెప్పారు. కొత్తపేట మండలం వానపల్లి పళ్లాలమ్మ దేవస్థానం ఈఓ బొక్కా వీర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన హుండీల లెక్కింపులో ఆలయ ఈఓ దూనబోయిన సాయిబాబు, పట్టణ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు నడింపల్లి వర్మ, భరణికాన గోవిందమ్మ, యెండూరి రాఘవ, కాశే చంటి, దూనబోయిన బుజ్జి, అర్చకులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

ముమ్మిడివరం: కొబ్బరి పంటకు వచ్చే వివిధ రకాల తెగుళ్ల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన అధికారి ప్రసన్నలక్ష్మి సూచించారు. కొత్తలంక సచివాలయం వద్ద ఎస్సీ, ఎస్టీ సొసైటీ భూముల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కొబ్బరి పంటపై రూగోస్ వలయాకార తెల్లదోమ ఎక్కువగా ఉందని, దీని నివారణకు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉద్యాన సహాయకులు బాబాయ్, సీపీ సొసైటీ అధ్యక్షుడు వాకపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

వైద్య పరిమితి పెంచాలి

అమలాపురం టౌన్: పెన్షనర్లకు వైద్య ఖర్చులు పెరుగుతున్న క్రమంలో ప్రభుత్వం హెల్త్ కార్డులపై ప్రస్తుతం ఉన్న వైద్య పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని ఏపీ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ సమావేశం విజ్ఞప్తి చేసింది. స్థానిక ఏవీఆర్ నగర్‌లోని అసోసియేషన్ భవనంలో జిల్లా శాఖ అధ్యక్షుడు పొరుపూడి కృష్ణశాస్త్రి అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. తొలుత జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కేకేవీ నాయుడు సమర్పించిన నివేదికపై చర్చించారు. జిల్లా అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సాయి వరప్రసాదరావు, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు చిక్కం సత్యనారాయణ, కె.రామకృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.